659 జెడ్‌పిటిసి స్థానాల్లో పోలింగ్

- 9,829 ఎంపిటిసిలకు కూడా • నోటిఫికేషన్ విడుదల
- ఓటుహక్కు వినియోగించుకోనున్న 2.81 కోట్ల మంది ఓటర్లు
- 35,333 పోలింగ్ కేంద్రాలు • రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. సోమవారం ఉదయం రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా నోటిఫికేషన్ విడుదల చేశారు. దీని ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 28 జిల్లా ప్రజా పరిషత్‌ల పరిధిలో 659 జెడ్‌పిటిసి, 659 మండల ప్రజా పరిషత్‌ల పరిధిలో 9,829 ఎంపిటిసి స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 2,81,34,518 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఈ సందర్భంగా పునేఠా మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 663 జెడ్‌పిటిసి స్థానాలు ఉన్నాయని, వాటిలో నాలుగు స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం లేదని చెప్పారు. అలాగే 29 ఎంపిటిసి స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం లేదని చెప్పారు. ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు 659 మండల కేంద్రాలు, 28 జిల్లా కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు జిల్లా ప్రజా పరిషత్‌లకు 28 మంది రిటర్నింగ్ అధికారులు, మండల ప్రజా పరిషత్‌లకు 687 మంది రిటర్నింగ్ అధికారులు, 1,374 మంది సహాయ రిటర్నింగ్ అధికారులను నియమించనున్నట్లు చెప్పారు. పోలింగ్ విధుల కోసం 35,333 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1,41,332 మంది ఇతర పోలింగ్ సిబ్బంది సేవలను వినియోగించుకోనున్నట్లు తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి

ఎన్నికల ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు వెంకట రామకృష్ణ తేజ వివరించారు. రాష్ట్రంలో మొత్తం 663 రెవెన్యూ మండలాలు ఉండగా, అమరావతి ప్రాంతంలోని నాలుగు మండలాలను మినహాయించి మిగిలిన 659 మండలాల్లో ఎన్నికల ప్రక్రియ చేపట్టినట్లు వివరించారు. మచిలీపట్నం, ఆదోని మండలాల విభజనతోపాటు న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కారం కావడంతో ఎన్నికలకు మార్గం సుగమమైందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి డాక్టర్ ఎ మల్లికార్జున, జెడి బి రాజకుమారి పాల్గొన్నారు.

రాష్ట్రంలో అతి చిన్న జిల్లా పరిషత్ ఛైర్మన్ గా విశాఖపట్నం నాలుగు జెడ్‌పిటిలతో ఏర్పాటు చేయడం గమనార్హం.

అంకెల్లో జెడ్‌పి ఎన్నికలు	
మొత్తం ఓటర్లు	2,81,34,518
పురుషులు	1,38,53,807
మహిళలు	1,42,79,285
మొత్తం పోలింగ్ కేంద్రాలు	35,333
సున్నితమైనవి	9,186
అత్యంత సున్నితమైనవి	16,181

ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికలు ఇలా..
కార్యక్రమం తేది
నామినేషన్ల ప్రారంభం 21.10.2026
నామినేషన్ స్వీకరణకు ఆఖరి రోజు 23.10.2026
నామినేషన్ల పరిశీలన 24.10.2026
తిరస్కరించబడిన నామినేషన్లపై అప్పీలు 25.10.2026
అప్పిలేట్ అధికారిచే అప్పీళ్ల పరిష్కారం 26.10.2026
నామినేషన్ల ఉపసంహరణకు చివరిరోజు 27.10.2026
పోలింగ్ తేదీ 03.11.2026
రీ పోల్ ఏదైనా ఉంటే 04.11.2026
ఓట్ల లెక్కింపు 05.11.2026

జిల్లా	జెడ్‌పిటిసి	ఎంపిటిసి
అనకాపల్లి	24	427
అనంతపురం	31	450
అన్నమయ్య	25	321
అల్లూరి	11	172
బాపట్ల	20	300
చిత్తూరు	27	370
కోనసీమ	19	379
తూర్పుగోదావరి	21	412
ఏలూరు	27	454
గుంటూరు	13	200
కాకినాడ	20	401
కృష్ణా	26	352
కర్నూలు	26	432
మార్కాపురం	21	274
నంద్యాల	28	377
ఎన్టీఆర్	16	280
పల్నాడు	28	419
పోలవరం	12	101
పార్వతీపురం	15	226
ప్రకాశం	27	373
నెల్లూరు	35	440
శ్రీ సత్యసాయి	32	397
శ్రీకాకుళం	30	542
తిరుపతి	35	444
విశాఖపట్నం	4	53
విజయనగరం	27	449
ప. గోదావరి	20	371
వైఎస్‌ఆర్ కడప	39	413
మొత్తం	659	9829

14 వరకు నవీకరించిన ఓటర్ల జాబితాయే..

- సింగిల్ జడ్జి ఉత్తర్వులు రద్దు

ప్రజాశక్తి-అమరావతి

2026 జులై 15 వరకు నవీకరించిన ఓటర్ల జాబితాను పరిగణనలోకి తీసుకునేలా అధికారులకు స్పష్టమైన, ఏకరూప ఆదేశాలు జారీ చేయాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు ధర్మాసనం రద్దు చేసింది. ఓటర్ల తుది జాబితాను పరిగణనలోకి తీసుకునే విషయంలో ఎప్పటికప్పుడు జారీ చేసిన సర్క్యులర్ల ఆధారంగా నిర్ణయం తీసుకోవచ్చని రాష్ట్ర ఎన్నికల సంఘానికి వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ అలపాటి గిరిధర్‌తో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్) ప్రక్రియలో భాగంగా డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో చేర్పులు, తొలగింపులు, సవరణల కోసం 2026 ఆగస్టు 31 వరకు అందిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను పరిష్కరించిన అనంతరం స్థానిక సంస్థల తుది ఓటర్ల జాబితాను ప్రచురించాలని కోరుతూ తామిచ్చిన వినతిపత్రాన్ని ఎన్నికల సంఘం పరిగణనలోకి తీసుకోలేదని హైకోర్టును వైసిపి ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సింగిల్ జడ్జి, జులై 15 వరకు నవీకరించిన ఓటర్ల జాబితాను పరిగణనలోకి తీసుకోవాలని ఈ నెల 16న ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశారు. ఎన్నికల సంఘం తరపున న్యాయవాది అశ్వినీకుమార్ వాదనలు వినిపిస్తూ, సింగిల్ జడ్జి ఆదేశాలు సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా ఉన్నాయన్నారు. ఈ నెల 14 వరకు నవీకరించిన ఓటర్ల జాబితాను అందించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘం కోరిందని, ఓటర్ల జాబితా విషయంలో తమ సర్క్యులర్ల ఆధారంగానే ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం సింగిల్ జడ్జి ఉత్తర్వులను రద్దు చేస్తూ తీర్పు చెప్పింది.

స్థానిక ఎన్నికల్లో పారా మిలటరీ దళాల ఏర్పాటుకు నిరాకరణ

ప్రజాశక్తి – అమరావతి

స్థానిక ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా జరిగేందుకు పారా మిలటరీ దళాలను ఏర్పాటు చేయాలంటూ వైసిపి దాఖలు చేసిన అప్పీలును హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టివేసింది. సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులు సబబేనని పేర్కొంటూ జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ అలపాటి గిరిధర్‌తో కూడిన ధర్మాసనం సోమవారం తీర్పు వెలువరించింది. నామినేషన్లు దాఖలు చేయకుండా ప్రతిపక్ష పార్టీల నేతలను అధికార కూటమి అడ్డుకుంటోందని, నామినేషన్ కేంద్రాల వద్దకు రానివ్వకుండా దాడులకు పాల్పడుతూ వాహనాలను తగులబెడుతున్నారని వైసిపి తరపున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదించారు. రాయలసీమలోని పలు ప్రాంతాల్లో పోలీసులు అధికార పార్టీ నేతలతో కుమ్మక్కై ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పారా మిలటరీ దళాలను ఏర్పాటు చేయడం తప్పనిసరని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదిస్తూ, రెండు జిల్లాల్లో జరిగిన ఆరేడు చిన్న ఘటనలను పెద్దవిగా చూపిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా పారా మిలటరీ దళాల ఏర్పాటును కోరుతున్నారని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్ పరిస్థితులతో పోలుస్తూ వైసిపి పిటిషన్ దాఖలు చేయగా, సింగిల్ జడ్జి దానిని తోసిపుచ్చారని తెలిపారు. పోలీసులు సమర్థంగా పనిచేస్తున్నారని, పరిస్థితి అదుపులో ఉందని, ఇప్పటికే సున్నిత, అతి సున్నిత ప్రాంతాలను గుర్తించి ఎన్నికల నిర్వహణకు 32.5 ప్లాటూన్ల పోలీసు బలగాలను మోహరించినట్లు ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం సింగిల్ జడ్జి ఉత్తర్వులను సమర్థిస్తూ వైసిపి అప్పీలును కొట్టివేస్తూ తీర్పు చెప్పింది.

230 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - గొలుగొండ (అనకాపల్లి)

గంజాయిని అక్రమంగా తరలిస్తున్న అంతర్జాతీయ స్మగ్లింగ్ ముఠాను నర్సీపట్నం రూరల్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. వారి నుంచి 230 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఐదుగురిని అరెస్టు చేశారు. ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలు, రూ.1.20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నర్సీపట్నం డిఎస్‌పి పి.శ్రీనివాసరావు సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఈ కేసులో తమిళనాడు రాష్ట్రానికి చెందిన శశికుమార్ ప్రధాన నిందితుని, అతడు అల్లూరి సీతారామరాజు జిల్లా, ఒడిశా అటవీ ప్రాంతాల నుంచి గంజాయిని కొనుగోలు చేసి తమిళనాడులోని చెన్నయ్, కోయంబత్తూరు, తంజావూరు ప్రాంతాలతో పాటు శ్రీలంకకు తరలిస్తూ విక్రయాలు జరుపుతున్నాడు. అల్లూరి జిల్లాకు చెందిన పాంగి సుబ్బారావు తన స్వగ్రామమైన బూరుగుపనుకుల గ్రామానికి స్మగ్లింగ్ ముఠా సభ్యులను రప్పించి వారికి 230 కిలోల గంజాయిని ఇటీవల సమకూర్చాడు. అతడు ఒడిశాలోని జనతా గ్రామంలో కిలో గంజాయిని రూ.ఐదు వేల చొప్పున కొనుగోలు చేశాడు. ఈ కేసులో మరో నిందితుడు వంతల చంటిబాబు. ఓ కేసులో జైలు నుంచి విడుదలైన తర్వాత వీరిద్దరూ ముఠాగా ఏర్పడి గంజాయిని ఇతర ప్రాంతాలకు, విదేశాలకు అక్రమంగా తరలిస్తున్నారు. శశికుమార్ తమిళనాడులోని తన స్నేహితులైన అమలరాజ్, మణికండన్, చంద్రకుమార్‌లను కూడా ముఠాలో చేర్చుకున్నాడు. ఈ నెల 14న తమిళనాడు నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లాకు చేరుకున్నారు. అక్కడ 230 కిలోల గంజాయిని కొనుగోలు చేసి ముందస్తుగా రూ.1.50 లక్షలు చెల్లించారు. మిగిలిన మొత్తాన్ని గంజాయి తుని జాతీయ రహదారికి చేరిన తర్వాత చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. గంజాయిని పది ప్లాస్టిక్ సంచుల్లో ప్యాక్ చేసి శ్రీలంకకు తరలించేందుకు వ్యూహం రచించారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం నర్సీపట్నం మండలం గబ్బాడ గ్రామ శివారులోని మార్గాల వద్దకు ముఠా చేరుకోగానే ముందస్తు సమాచారం మేరకు పోలీసులు మాటువేసి ఐదుగురిని అరెస్టు చేసినట్లు డిఎస్‌పి తెలిపారు.

అధికార బలంతో ఏకగ్రీవాలకు యత్నం

- చిన్న సాకులతో నామినేషన్ల తిరస్కరణ
- అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు

ప్రజాశక్తి - యంత్రాంగం

అధికార పార్టీ నేతల ప్రోద్బలంతో అధికారులు పలువురి నామినేషన్లను తిరస్కరించారు. చిన్న చిన్న కారణాలను సాకుగా చూపి నామినేషన్లను పక్కన పెట్టడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాత్రికి రాత్రే కొత్త నిబంధనలను తెరపైకి తెచ్చి తమను అనర్హులుగా ప్రకటిస్తున్నారని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ చైర్మన్ స్థానాలను ఎలాగైనా ఏకగ్రీవం చేసుకునేందుకు అధికార పక్ష నేతలు సామ, దాన, భేద, దండోపాయాలను ప్రదర్శిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తిరుపతిలో సిపిఎం తరపున 58వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి రాధమ్మ నామినేషన్ ను అధికారులు తిరస్కరించారు. రాధమ్మ నామినేషన్ ఎన్నికల అధికారి తిరస్కరిస్తున్నట్లు ప్రకటించడంతో ఎందుకు తిరస్కరించారని కారణాలు చెప్పాలని సిపిఎం నాయకులు కోరడంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి 57వ డివిజన్‌లో ఉంటున్న రాధమ్మ 58వ డివిజన్‌లో పోటీ చేయడానికి లేదంటూ సాకు చూపించి నామినేషన్‌ను తిరస్కరించారు. దీంతో ఆమె ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. 48, 49 వార్డులకు సిపిఎం అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసినప్పటికీ జాబితాలో సంఖ్యాపరంగా జీరో చూపించారు.

మడకశిరలో జనసేనకు షాక్

శ్రీ సత్యసాయి జిల్లా మడకశిరలో జనసేనకు గట్టి షాక్ తగిలింది. కూటమి తరుపున జనసేన అభ్యర్థిగా చైర్మన్ పదవికి ఎస్‌సి.శ్రీనివాసులు నామినేషన్ వేశారు. ఆయనతోపాటు సంజీవరత్న, టి.రామకృష్ణ డమ్మీలుగా నామినేషన్లు దాఖలు చేశారు. అయితే ఈ ముగ్గురు నామినేషన్లు స్క్రూటినీలో తిరస్కరణకు గురయ్యాయి. పత్రాల్లో అన్నింటిని పూరించకపోవడంతో తిరస్కరించినట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

తాడిపత్రిలో 26 వార్డులకు సింగిల్ నామినేషన్లు

అనంతపురం జిల్లా తాడిపత్రి మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 48 వార్డులకుగానూ స్క్రూటినీ తరువాత 26 వార్డులకు సింగిల్ నామినేషన్‌లు దాఖలైనట్లు సమాచారం. గుత్తిలో చైర్మన్ పదవికి ఎనిమిది నామినేషన్లు దాఖలవ్వగా వైసిపి, బిఎస్‌పితో ఇతర అభ్యర్థుల నామినేషన్ల తిరస్కరణకు గురయ్యాయి. టిడిపి అభ్యర్థిని ఒక్కటే ఆమోదం పొందడంతో చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవమయ్యే అవకాశం ఉంది.

కోర్టు ఉత్తర్వులతో దాఖలు చేసినా తిరస్కరణ

కోర్టు ఉత్తర్వులతో నామినేషన్ దాఖలు చేసిన రాచేపల్లి నగర పంచాయతీ వైసిపి చైర్మన్ అభ్యర్థి కొప్పుల రవికుమార్ నామినేషన్ను అధికారులు తిరస్కరించారు . నామినేషన్ సెక్యూరిటీ డిపాజిట్ రూ.3,000 చెల్లించని కారణంగా ఆయన నామినేషన్‌ను తిరస్కరించినట్లు తెలిపారు. టిడిపి అభ్యర్థి తంగెళ్ల శ్రీనివాసరావు నామినేషన్ ఆమోదం పొందడంతో ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉంది. కమలాపురం, బద్వేలు, రాజంపేట మున్సిపల్ చైర్మన్ పదవులకు ఎవ్వరూ పోటీ చేయకుండా అధికార పార్టీ నేతలు అడ్డుకోవడంతో ఈ స్థానాలు ఏకగ్రీవం కానున్నాయి.

22, 23 తేదీల్లో నల్ల బ్యాడ్జీలతో నిరసనలు : ఆర్‌టిసి జెఎసి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్‌ఆర్‌టిసి పరిరక్షణ, ఉద్యోగుల ఉపాధి భద్రతకు ఈ నెల 22, 23 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా నల్ల బ్యాడ్జీలతో నిరసనలు చేపట్టనున్నట్లు ఎపిపిటిడి (ఆర్‌టిసి) ఉద్యోగ సంఘాల జెఎసి ప్రకటించింది. 1,450 విద్యుత్ బస్సుల ప్రైవేటు టెండర్లను రద్దు చేయాలని జెఎసి కన్వీనర్లు వై శ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరరావు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 29 డిపోల్లో జిసిసి విధానంలో బస్సుల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. విద్యుత్ బస్సులకు తాము వ్యతిరేకం కాదని, ఆర్‌టిసియే కొనుగోలు చేసి సొంత సిబ్బందితో నడపాలని పేర్కొన్నారు. డిపోలు, మౌలిక సదుపాయాలను ప్రయివేటుకు అప్పగించొద్దని, 15 వేల ఖాళీ పోస్టులను భర్తీ చేసి, మూసివేసిన నాలుగు డిపోలను పునఃప్రారంభించాలని కోరారు. ప్రభుత్వం, యాజమాన్యం టెండర్లను రద్దు చేసి జెఎసితో చర్చించాలన్నారు. ఈ నెల 26న విజయవాడలో రాష్ట్ర కమిటీ సమావేశం అనంతరం భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటించనున్నట్లు తెలిపారు.

రోకళ్ల సత్యనారాయణను కాపాడుతున్నారా? : ఎమ్మెల్యే శ్రావణి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డ్రగ్స్ కేసులో దొరికిన పులగం కొండారెడ్డిని కాపాడినట్లే ఇప్పుడు కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి అనుచరుడు రోకళ్ల సత్యనారాయణను కాపాడుతున్నారా? అని వైసిపి అధినేత వైఎస్ జగన్‌ను టిడిపి ఎమ్మెల్యే బండారు శ్రావణి ప్రశ్నించారు. ద్వారంపూడి అక్రమ బియ్యం మాఫియాను, కాకినాడ పోర్టు దందాలను, సెటిల్మెంట్లను నడిపించిన సత్యనారాయణ బ్యాంకాక్ నుంచి తెచ్చిన రూ.కోట్ల సింథటిక్ డ్రగ్స్‌తో డిఆర్‌ఐ అధికారులకు అడ్డంగా బుక్కయ్యారని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన వెనుక ఉన్న వారి పేర్లు ఎక్కడ చెప్పాల్సి వస్తుందోనన్న ప్రాణ భయంతో విచారణ గదిలోనే ఆత్మహత్యాయత్నం చేశాడంటే ఈ రాకెట్ వేళ్లు తాడేపల్లి ప్యాలెస్‌లోని ఏ గది వరకు పాకాయో జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఈసారైనా రక్తపాతం ఆగేనా?

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

సంప్రదాయం ముసుగులో పాత కక్షలతో కర్రల దెబ్బలకు తలలు పగిలి అన్నతుల పాలై ప్రాణాలు కోల్పోవడం కర్నూలు జిల్లా హొళగుంద మండలంలోని కర్రల సమరం (బన్నీ ఉత్సవం)లో పరిపాటిగా మారింది. పోలీసులు ఎన్ని భద్రతా చర్యలు చేపట్టినా చివరికి రింగు కర్రలు ఉత్సవంలో కరాళ నృత్యం చేస్తున్నాయి. దసరా సందర్భంగా బన్నీ ఉత్సవంలో కర్రల సమరం నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది బుధవారం రాత్రి ఈ సమరం జరగనుంది. ఈ నేపథ్యంలో పోలీసులు ఇప్పటికే 190 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. 40 కార్డన్ సెర్చ్ ఆపరేషన్లలో 300 కర్రలను స్వాధీనం చేసుకున్నారు. ఐదు చెక్‌పోస్టులు, పది పోలీసు పికెట్లను ఏర్పాటు చేశారు. 110 నైట్ విజన్ సిసి కెమెరాలు, 700 ఎల్‌ఇడి లైట్లు, పది డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘా చేస్తున్నారు. ఉత్సవంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటుచేసుకోకుండా అడిషనల్ ఎస్‌పిలు, డిఎస్‌పిలు, సిఐలు, ఎస్‌ఐలతో సహా మొత్తం వెయ్యి మందితో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. 2023లో కర్రల సమరంలో ముగ్గురు మృతి చెందారు. వంద మందికిపైగా గాయాలయ్యాయి. 2024లో తొక్కిసలాటలో 70 మంది గాయపడ్డారు. 2025లో ఇద్దరు చనిపోయారు. సుమారు వంద మందికి గాయాలయ్యాయి. గతంలోనూ పోలీసులు గట్టి చర్యలు చేపట్టినా తలలు పగలడం మాత్రం ఆగలేదు. గత అనుభవాల దృష్ట్యా ఈసారైనా రక్తపాతం ఆగుతుందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కర్రల సమరం జరుగుతుందిలా..

దసరా నేపథ్యంలో ఈ ఏడాది ఈ నెల 21న రాత్రి మాళ మల్లేశ్వరస్వామి, మాళమ్మ ఉత్సవ విగ్రహాలకు కల్యాణం నిర్వహించనున్నారు. అనంతరం కొండపై నుంచి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో కిందకు తీసుకొస్తారు. ఈ సమయంలో నెరణికి, నెరణికి తండా, కొత్తపేట తదితర గ్రామాల భక్తులు ఒక గ్రూపుగా, ఆలూరు, ఎల్లార్తి, సుళువాయి, నిట్రవట్టి, అరికెర తదితర గ్రామాల భక్తులు మరో గ్రూపుగా ఏర్పడి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు మార్గంలో కర్రలతో తలపడుతుంటారు. విగ్రహాలను తమ గ్రామాల వైపు తీసుకెళ్లడం లేదా ఊరేగింపును కొంతసేపు అడ్డుకోవడం శుభసూచకమనే నమ్మకంతో ఈ పోటీ జరుగుతుంది. పొడవాటి కర్రలకు ఇనుప రింగులు అమర్చి, దివ్వెల మోతలు, నినాదాల సమరంలో పాల్గొంటుంటారు. ప్రశాంతంగా నిర్వహించుకోవాలి బన్నీ ఉత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలి. ఈ ఉత్సవం సంప్రదాయబద్ధమైన వేడుక. దీనిని కర్రలతో పరస్పరం దాడులు చేసుకునే కార్యక్రమంగా భావించకూడదు. హింసకు పాల్పడవద్దు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశాం.

equitas
ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్
ఫోన్ : 044-42995000, 044-42995050
స్థిరాస్తి అమ్మకం కొరకు విక్రయ నోటీసు
www.bankeauctions.com
తేది : 20.10.2026

నివాస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
NIWAS HOUSING FINANCE
స్వాధీన నోటీసు [నియమం 8 (1) మరియు (2)]

గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
GRIHUM

గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
GRIHUM
రిజిస్టర్డ్ ఆఫీసు: 6వ అంతస్తు, బి-వింగ్, ఫినిక్స్ మార్కెట్ సిటీ, విమాన్ నగర్ రోడ్, పూణే, మహారాష్ట్ర 411014.
సర్ఫేసి చట్టం 2002లోని సెక్షన్ 13(2) కింద డిమాండ్ నోటీసు
స్థలం : విజయనగరం, తేది : 20-10-2026